సాక్షి
మహబూబాబాద్
శనివారం | 18 | ఫిబ్రవరి | 2023



తెలుగును పరిరక్షించడం...

తెలుగును పరిరక్షించడం మన అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ పూర్వ సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. - 8లో▸



'లక్ష్మీపురం' ఆదాయానికి గండి

అధికారుల ఉదాసీనత.. వ్యాపారుల నిర్లక్ష్యంతో లక్ష్మీపురం మార్కెట్‌లో సుమారు రూ.1.50కోట్ల ఆదాయం కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
38.4°/14.9°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పొగమంచుతో పాటు చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

కురవి జాతరకు ప్రత్యేక బస్సులు

నెహ్రూసెంటర్: మహాశివరాత్రి సందర్భంగా కురవి వీరభద్రస్వామి ఆలయంలో వద్ద జరిగే జాతరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు మానుకోట ఆర్టీసీ డిపో మేనేజర్ జె.విజయ్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, శ్రీనివాససెంటర్, తొర్రూర్ పాయింట్, కురవి గేట్ పాయింట్ల నుంచి భక్తులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. జాతరకు వెళ్లే భక్తుల కోసం సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నామని, పెద్దలకు రూ.20, చిన్నారులకు రూ.10గా ఉన్నాయన్నారు. ప్రతి బస్సు పాయింట్‌వద్ద భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా వలంటీర్లు ఉంటారని తెలిపారు. డిపో నుంచి 13బస్సులు 243 ట్రిప్పులు తిరుగుతాయని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకుని సురక్షిత ప్రయాణాన్ని ఆర్టీసీ ద్వారా పొందాలని డీఎం సూచించారు.

పోస్టుమార్టం సేవలు అందుబాటులోకి తెస్తాం




తొర్రూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పోస్టుమార్టం సేవలను అందుబాటులోకి తెస్తామని డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ తెలిపారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన పోస్టుమార్టం గదిని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. కల్పించాల్సిన సౌకర్యాలు, సిబ్బంది నియామకంపై అధికారులతో చర్చించారు. అతి త్వరలోనే పోస్టుమార్టం గదిని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్, వైద్యాధికారి మీరాజ్, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సమర్థంగా నిర్వహించాలి



గంగారం: కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష అన్నారు. గంగారం మండలంలోని మడగూడెం గ్రామంలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చుంచ వెంకటలక్ష్మి, కంటి వెలుగు వైద్యాధికారి క్రాంతి, మెడికల ఆఫీసర్ కిరణ్, ఏఎన్‌ఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



గార్ల: పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ రామారావు సూచించారు. శుక్రవారం గార్ల ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తహసీల్దార్ రాము, ఎంఈఓ ఫూల్‌చంద్, ఎస్సై బానోత్ వెంకన్న, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్రావ్, హైస్కూల్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రామారావు కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌తో పాటు చిలుకోడు శివారు మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నాపత్రాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. డీఈఓ హాజరై మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మేనేజర్ ఉదయ్‌కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణభాను, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మరియామాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

17మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్, పీజీ కోర్సుల మూడవ సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ వివిధ కేంద్రాల్లో స్క్వాడ్లకు పట్టుబడి 17మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్‌లు తెలిపారు.

వీరన్నకు కోటి దండాలు

- కోరమీసం పెడితే గౌరవం.. బోనం చేస్తే ధైర్యం
- కోర్కెలు తీర్చే కురవి వీరభద్రుడు
- ఆదిశైవ ఆచారం ప్రకారం పూజలు
- పొర్లు దండాలు, పాననరంతో వరాలు
- మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు



విద్యుత్ వెలుగుల్లో వీరభద్రస్వామివారి ఆలయం

సాక్షి, మహబూబాబాద్/కురవి: ఒక్కో దేవాలయానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. కురవి వీరభద్రుడికి కోర మీసం పెడితే గౌరవం.. భద్రకాళీ అమ్మవారికి బోనం చేస్తే ధైర్యం. ఈ మేరకు భక్తులు వీరన్నకు కోర మీసం, భద్రకాళీ అమ్మవారికి బోనం చేస్తామని మొక్కుకుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న వీరభద్రస్వామి ఆయలంలో ఏటా మహా శివరాత్రి నుంచి మొదలుకొని మూడు నెలలపాటు జరిగే జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

శైవాగమం

ఆదిశైవులు(పూజారులు) శైవాగమం ప్రకారం స్వామివారికి నిత్య పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. గతంలో వంశపారపర్యంగా వచ్చిన అర్చకులు పూజలు చేసే వారు. నేడు ఆ విధానాన్ని తొలగించి వేదపండితులను ఉద్యోగులుగా తీసుకుంటున్నారు. అయితే కాలం మారినా.. పూజారులు మారినా.. ఇక్కడ దేవుడికి చేసే పూజా విధానంలో మార్పు ఉండదు. ప్రతీ సోమవారం ఉదయం వేళ (ప్రాతఃకాలం) సంపూర్ణాభిషేక పూజలు నిర్వహిస్తారు. మిగిలిన రోజుల్లో అభిషేకాలు, అర్చనలు చేస్తుంటారు.

బోనం చేస్తే ధైర్యం..

భక్తుల కోర్కెలు తీరడంతో భద్రకాళీ అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే యాటపోతులు, కోళ్లను బలిచ్చి కూడా మొక్కు చెల్లించుకుంటారు. ఇక్కడ గిరిజన, గిరిజనేతరుల అలవాట్ల ప్రకారం అమ్మవారికి బోనం చేసి యాటలు, కోళ్ల బలిస్తే ఆపదలు తీరుతాయి, వచ్చే గండాలు వైదొలుగుతాయని భక్తుల నమ్మిక.

పొర్లు దండాలు, పాననరం

పిల్లలు లేనివారు కురవి వీరన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తే సంతానం కలుగుతుందని నమ్మకం. సంతానం కోసం స్త్రీ, పురుషుల్లో ఎవరో ఒకరు తడి దుస్తులతో స్నానం చేసి ఆలయ ఆవరణలో పాననరం పట్టి స్వామివారిని వేడుకుంటారు. పొర్లుదండాలు పెట్టి కూడా వేడుకోవడం ఇక్కడి ప్రత్యేకత.

కోరమీసం పెడితే గౌరవం

కోరమీసం సమర్పిస్తే గౌరవం, అధికారం కలుగుతుందని నానుడి. అందుకోసమే రాజకీయ నాయకులు ఎన్నికల్లో పోటీచేసే సమయంలో.. విద్యార్థులు ఉద్యోగ దరఖాస్తు చేసే సమయంలో.. ఇతర వ్యాపారాలు ప్రారంభించే సమయంలో వీరభద్రుడికి కోరమీసం సమర్పిస్తామని మొక్కుకుంటారు. కోరికలు తీరగానే బంగారం, వెండితో కోరమీసాల ఆకృతి తయారు చేసి స్వామివారికి అలంకరిస్తారు.

కృతజ్ఞతతో మొక్కులు..

కోరికలు తీరడంతో మొక్కులు చెల్లించుకుంటారు. చిన్న పిల్లలు, పెద్దలు కోడెను పట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కు చెల్లించుకుంటారు. అలాగే తలనీలాలను సమర్పిస్తారు. స్వామి వారిని కోర్కెలు కోరేందుకు ఎంత నిష్టతో పూజలు నిర్వహిస్తారో.. కోర్కెలు తీరిన తర్వాత కూడా అంతే నిష్ఠ, నియమాలతో పూజలు చేస్తారు.

రాణి రుద్రమ్మ విజయోత్సవం జరిపిన చోటు..

వేంగి చాళుక్యుల కాలంలో క్రీస్తుశకం 850లో కురవి వీరభద్రస్వామి దేవాలయం నిర్మించారు. చాళుక్య రాజులు రాతిస్తంభంపై ఏర్పాటు చేసిన శివుడి వాహనం నందీశ్వరుడు గుడిని కాపలా కాస్తున్నట్లు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ముందుగా చాళుక్యులు, తర్వాత కాకతీయులు వీరభద్రుడిని ఆరాధ్య దైవంగా కొలిచేవారు. ఇందులో భాగంగానే వీరభద్రుడిని మొక్కి యుద్ధానికి వెళ్లిన కాకతీయ రాణి రుద్రమదేవి విజయం సాధించిన తర్వాత కురవిలో విజయోత్సవం జరుపుకున్నారు. ఇందుకు గుర్తుగా ఏకశిలా రాత్రి స్తంభం నిర్మించారు. ఇప్పటికీ విజయోత్సవానికి గుర్తుగా కార్తీక పౌర్ణమిరోజు ఈ రాతి స్తంభంపై జ్వాలా తోరణం ఏర్పాటు చేస్తారు.

జాతరకు సర్వం సిద్ధం

మహా శివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం ఆలయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బాంబ్‌స్క్వాడ్ బృందం తనిఖీ చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, ఏడుగురు సీఐలు, 28 మంది ఎస్సైలు, 9 మంది ఏఎస్సైలు, 10 మంది జమేదార్లు, 71 మంది కానిస్టేబుళ్లు, 16 మంది మహిళా కానిస్టేబుళ్లు, 30 మంది స్పెషల్ పార్టీ పోలీసులుతో పాటు 40మంది హోంగార్డులు బందోబస్తు పాల్గొంటున్నారు. 50మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో విధులు నిర్వహిస్తారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు జాతరలో పారిశుద్ధ్య పనులు చేపించారు. వైద్య శిబిరం, ఆర్టీసీ బస్సు పాయింట్‌లు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు.

అంకురార్పణ పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల అంకురార్పణ పూజలను శుక్రవారం వేదపండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంకురార్పణ పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చకుడు రెడ్యాల శ్రీనివాస్ కుటుంబం ఇంటి వద్ద నుంచి స్వామి, అమ్మవారికి పసుపు, కుంకుమలు మేళతాళాల నడుమ ఆలయానికి తీసుకొచ్చారు. వారికి ఆలయ ఈఓ సత్యనారాయణ స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నేడు(శనివారం) మహాశివరాత్రి సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకోనున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో వసతుల కల్పన, ఉత్తమ ఫలితాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో ఐదుగురు పదో తరగతి విద్యార్థులు 10జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు ఉన్నాయని, సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి పాఠశాలకు వెళ్లే రహదారులను శుభ్రం చేయించాలన్నారు. పాఠశాలలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పెద్దవంగర, గంగారం కేజీబీవీలను మార్చి నెలాఖరులోగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారాల్లో రాణించాలి

మహిళలు ప్రభుత్వం నుంచి పొందిన రుణాలతో వ్యాపారాల్లో రాణించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో బ్యాంక్ లింకేజీ రుణాలు, స్త్రీనిధి, తదితర పథకాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. క్రమంతప్పకుండా రుణాలు తిరిగి చెల్లించేవారే వ్యాపారాల్లో రాణిస్తారని, వారికి అదనంగా రుణాలు ఇప్పించాలన్నారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విక్రయ ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని, తద్వారా వారికి వ్యాపారంపై పట్టు పెరుగుతుందన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ ఉన్నారు.

మీకు దమ్ముంటే నాపై దాడి చేయించండి

- నిరుపేదల పక్షాన మాట్లాడితే బెదిరిస్తారా..
- మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై వైఎస్.షర్మిల మండిపాటు
- నెల్లికుదురులో కొనసాగిన ప్రజాప్రస్థానం పాదయాత్ర



నెల్లికుదురులో వైఎస్ షర్మిల పాదయాత్ర

నెల్లికుదురు: 'మీరు అమాయక ప్రజలను బెదిరించి భూములు గుంజుకుంటుంటే మేము చూస్తూ ఊరుకోవాలా.. ప్రశ్నిస్తే బెదిరిస్తారా.. ఓ ఎమ్మెల్యే సైగ చేస్తే కార్యకర్తలు దాడి చేస్తారట.. మీపై నేను చేస్తున్న ఆరోపణలు నిజం.. మీకు దమ్ముంటే నాపై దాడి చేయించండి' అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ధ్వజమెత్తారు. ఆమె చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర శుక్రవారం తొర్రూరు మండలం పీజీతండా, మడిపల్లి క్రాస్, సోమారంకుంటతండా మీదుగా నెల్లికుదురు మండలంలోని కాచికల్ క్రాస్, నెల్లికుదురు క్రాస్ రోడ్ నుంచి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా వైఎస్.షర్మిల మాట్లాడారు. కేసీఆర్ పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. తాగునీరు, రోడ్డు సౌకర్యం లేని తండాలు ఉన్నాయని, మాట-ముచ్చట కార్యక్రమంలో గిరిజనులు తమగోడును చెప్పుకున్నారన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో అడుగుపెట్టగానే అక్రమాలకు పాల్పడే భూ కబ్జాకోరు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ భుజాలు తడుముకుంటున్నాడని, పాదయాత్ర భయం పట్టుకుందన్నారు. పాదయాత్రకు అడ్డంకి కలిగించే విధంగా కార్యకర్తలను ఉసిగొల్పుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు ఆపేయమనడానికి నీవెవరు.. నీ ఇంట్లో నుంచి ఇస్తున్నావా.. తెలంగాణ నీ అబ్బ సొత్తా అని మంత్రి దయాకర్‌రావుపై మండిపడ్డారు. దమ్ముంటే మీ నియోజకవర్గాల్లో పబ్లిక్ ఫోరాలు పెట్టండి, మీరు చేసే కబ్జాలపై ప్రజలే నిలదీస్తారని అన్నారు. పరిపాలన చేయమని ప్రజలు ఓట్లేస్తే అక్రమాలకు పాల్పడుతూ దోచుకుంటున్నారని అన్నా రు. రాజన్న రాజ్యం రావాలంటే మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ లాంటి వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టాలని సూచించారు. ఒక్కసారి అవకాశం ఇస్తే రాజన్న పాలన తెస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాదయాత్ర పార్వతమ్మగూడెం, రావిరాల, మదనతుర్తి, మునిగలవీడు, శ్రీరామగిరి, బంజర తండా వరకు సాగింది. సుజాత మంగిలాల్, రాములు నాయక్, రాము నాయక్, యాకూబ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల రహస్య భేటీ

- మానుకోట మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం కోసం ప్రయత్నం
- అధికార పార్టీ నుంచే తిరుగుబాటు
- కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కౌన్సిలర్లను కూడగట్టేందుకు యత్నం
- ఎమ్మెల్సీ అనుచరుడు కౌన్సిలర్ ఎడ్ల వేణు ఇంట్లో సమావేశం

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అధికార పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు శుక్రవారం రహస్య సమావేశం నిర్వహించారు. అదికూడా ఎమ్మెల్సీ రవీందర్‌రావు అనుచరుడైన అధికార పార్టీ కౌన్సిలర్ ఎడ్ల వేణు ఇంట్లో భేటీ అయ్యారు. అవిశ్వాస తీర్మానంలో నెగ్గేందుకు పావులు కదుపుతున్నారు.

మూడేళ్లు పూర్తి

మానుకోట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్ విషయంలో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. దీంతో వారు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. కాగా పాలక వర్గం ప్రమాణ స్వీకారం చేసి మూడేళ్లు పూర్తయింది. ఈమేరకు అవిశ్వాస తీర్మానం పెట్టాలనే ఉద్దేశంతో కౌన్సిలర్ ఎడ్లవేణు ఇంట్లో సుమారు పదిమంది అధికారి పార్టీ కౌన్సిలర్లు సమావేశమైనట్లు తెలిసింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కౌన్సిలర్లను కూడగట్టుకుని అవిశ్వాస తీర్మానంలో నెగ్గాలని చర్చించినట్లు సమాచారం.

బలబలాలు ఇలా..

మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన 19మంది, కాంగ్రెస్ నుంచి 10మంది, సీపీఐ నుంచి ఇద్దరు, సీపీఎం నుంచి ఇద్దరు, స్వతంత్రులు ముగ్గురు గెలుపొందారు. కాగా ఇండిపెండెంట్‌గా గెలిచిన ముగ్గురితో పాటు కాంగ్రెస్ నుంచి నలుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ చేరారు. దీంతో ఆ పార్టీ బలం 26కు చేరింది. అయితే ఆ పార్టీ కౌన్సిలర్ రవి ఇటీవల మృతి చెందగా వారి సంఖ్య 25కి చేరింది. అలాగే కాంగ్రెస్‌లో ఆరుగురు, సీపీఐలో ఇద్దరు, సీపీఎంలో ఇద్దరు ఉన్నారు.

తీర్మానం నెగ్గాలంటే..

మున్సిపాలిటీలోని 36మంది కౌన్సిలర్లలో 24మంది మద్దతు ఉంటే అవిశ్వాస తీర్మానం నెగ్గే అవకాశం ఉంది. కాగా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఎడ్ల వేణు, సలీంతో పాటు మరో ఎనిమిది మంది కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. వీరికి సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్‌కు చెందిన 10మంది కౌన్సిలర్లు టచ్‌లో ఉన్నారని చెబుతున్నారు. దీంతో మరో నలుగురిని టచ్‌లోకి తీసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. కాగా కాంగ్రెస్, ఇతర పార్టీల కౌన్సిలర్లు మాత్రం తాము ఎవరితో టచ్‌లో లేమని చెప్పారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ కౌన్సిలర్లలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ వర్గాలకు చెందినవారు ఉన్నారు. ముఖ్య నాయకులు కూర్చొని మాట్లాడి సర్దిచెబుతారా లేదా అనేది తేలాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సైతం రహస్యంగా భేటీ అయినట్లు తెలిసింది.

ఒట్టు తీసుకుని.. ఓటు వేయాలని..

- సబ్బండ వర్గాలను పలకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సాగిన టీపీసీసీ చీఫ్ రేవంత్ పాదయాత్ర
- బహిరంగ సభలో ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియంపై పొగడ్తలు.. విమర్శలు

జఫర్‌గఢ్/స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ: అభిమానులు తరలిరాగా.. అడుగులో అడుగు వేస్తూ.. ఊరి ప్రజలతో మమేకమవుతూ.. పొలాల వద్ద రైతులు.. కూలీలను ఆప్యాయంగా పలకరిస్తూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 'హాథ్ సే హాథ్'జోడో పాదయాత్ర ఉత్సాహంగా ముందుకు సాగింది. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరు క్యాంపు వద్ద బస చేసిన రేవంత్‌రెడ్డిని.. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం గజమాలతో స్వాగతం పలికారు. ఉదయం 10.30 గంటలకు కూనూరు నుంచి మొదలైన పాదయాత్ర.. ఉప్పుగల్, పాంనూర్, శివునిపల్లి మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్ శివాజీ చౌక్ వరకు సాగింది. రహదారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ.. వారు చెప్పిన సమస్యలు ఓపికతో విన్నారు. విన్నపాలు స్వీకరిస్తూ తల్లీ.. ఈ కాగితం నా దగ్గరే ఉంటుంది.. మన ప్రభుత్వం రాగానే పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారు. ఉప్పుగల్ శివారులో ఆటోలో వెళ్తున్న ఓ వృద్ధురాలితో రేవత్‌రెడ్డి మాట్లాడారు. అమ్మా.. బంగారు తెలంగాణలో నీ మెడలో బంగారమే లేకపాయే.. రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు మనకు ఇళ్లొచ్చినయ్.. అంటూ కాంగ్రెస్‌కే ఓటు వేయాలని ఒట్టు తీసుకున్నాడు.

రాజయ్య, కడియంను పొగిడి.. టార్గెట్ చేసి

స్టేషన్ ఘన్‌పూర్ బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి.. స్థానిక ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని పొగిడినట్టే పొగుడుతూ.. టార్గెట్ చేశారు. ఇద్దరు ఉప ముఖ్యమంత్రులుగా పని చేసి వందపడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల తెచ్చుకోలేదన్నారు. రాజయ్య, కడియం ఒకరినొకరు కొట్టుకునేలా చేసి.. కేసీఆర్ సినిమా చూపిస్తున్నాడని అన్నారు. రాజకీయ భిక్షపెట్టిన కాంగ్రెస్‌కు ద్రోహం చేసిన రాజయ్యకు బీఆర్ఎస్‌లో పరాభవమే దక్కిందని, దొరగారి దొడ్లో బతకాలంటే.. గాడిదకంటే హీనంగా చూస్తారంటూ చురకలు వేశారు. టీడీపీలో ఉన్నప్పుడు ఆత్మగౌరవంతో పని చేసిన కడియం శ్రీహరి.. ఇప్పుడు కేసీఆర్ దొరల పాలనతో అవన్నీ వదిలి పెట్టినట్టు కనిపిస్తున్నదని విమర్శించారు.



తమ సమస్యలు చెప్పుకుంటున్న కూనూరు ప్రజలు



బైరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ..

ఉదయం 10.40 – 10.55 గంటలు..

పాదయాత్ర సందర్భంగా రేవంత్‌రెడ్డిని కూనూర్‌కు చెందిన రైతు శిరబోయిన శ్రీనివాస్, మరికొందరు రైతులు కలిశారు. ఉప్పుగల్లు రిజర్వాయర్ వద్ద గేట్‌వాల్వ్ ఏర్పాటు చేసి, ఉప్పుగల్లు, కూనూర్, తమ్మడపల్లి(ఐ), కోనాయిచలం, తిడుగు, గర్మిళపల్లి గ్రామాల మీదుగా ఉన్న ఆకేరు వాగులోకి నీరు విడుదల చేసేలా చూడాలని విన్నవించారు. అధికారంలోకి రాగానే గేట్‌వాల్వ్ బిగించి నీళ్ల వచ్చేలా చేస్తామని రేవంత్ చెప్పారు. కూనూరు పెద్దమ్మ గుడి వద్ద ముదిరాజ్‌లు రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.

11.20 – 11.45 గంటలకు

ఉప్పుగల్లులో రోడ్డుపక్కన ఉన్న బైరి శ్రీనివాస్ ఇంటికి వెళ్లిన రేవంత్‌రెడ్డి.. కుటుంబ సభ్యులను పలకరించాడు. అధికారంలోకి వస్తే.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వివరించారు. తమ గ్రామానికి బస్సు రావడం లేదని అక్కడే ఉన్న మహిళలు పీసీసీ చీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామపంచాయతీ వద్ద జీపీ సిబ్బంది రేవంత్‌ను కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. నెలకు రూ.8,500 వేతనం సరిపోవడం లేదని చెప్పగా.. మన ప్రభుత్వం వచ్చాక గొప్పగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత రోడ్డుపక్కనే ఉన్న ఆటో డ్రైవర్లను రేవంత్‌రెడ్డి పలకరించారు.

మధ్యాహ్నం 12.30 గంటలకు..

ఉప్పుగల్లులో ఓ గౌడన్న పొద్దాడు కల్లు తీసుకుని ఇంటికి వెళ్తుంటే.. ఆపిన రేవంత్‌రెడ్డి లొట్టి చేతికి తీసుకుని ధర ఎంతనే.. లాభం ఉంటుందా అంటూ అడిగారు. గ్రామ శివారులో రైతు కావటి రాజయ్య మొక్కజొన్న కొయ్యకాళ్లను కాడెద్దులతో దున్నుతుండగా.. రేవంత్ వెళ్లి నాగలి చేతిలోకి తీసుకుని.. కొద్దిదూరం దున్నాడు. తాతా.. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే ఒకేసారి రూ.2లక్షల బ్యాంకు రుణం మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సీతక్క, పార్టీ సీనియర్ నాయకులు మల్లు రవి, షబ్బీర్ అలీ, జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, నాయకులు గంగారపు అమృతరావు, దొమ్మాటి సాంబయ్య, చేపూరి వినోద్, అన్నెబోయిన భిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, సీహెచ్.కృష్ణమూర్తి, సదయ్యగౌడ్, నూకల ఐలయ్య, తాటికాల రాజేందర్‌తో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకున్నారు.

తెలంగాణ అభివృద్ధికి సీఎం కృషి

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్: తెలంగాణ అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేశారని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. దళారుల మాటలు నమ్మి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నష్టపోవద్దని, అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. వలసవాదులు మళ్లీ వస్తున్నారని అన్నారు. వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాజన్న రాజ్యం వస్తుందని పాదయాత్ర చేస్తుండగా, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. వారు బరితెగించి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వలసవాదుల పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయం ప్రజలకు తెలుసని, మళ్లీ మానుకోట రాళ్లకు పని పెట్టేవిధంగా చేసుకోవద్దని, నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, మార్నేని వెంకన్న, చిట్యాల జనార్దన్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, తేళ్ల శ్రీను, రాజశేఖర్, సలీం, గద్దె రవి, రాజు, బాలు, శంకర్, గోపి, శివ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ఈనెల 25, 26 తేదీల్లో 8వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14, 16, 18, 20 బాలబాలికలు, మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 19న హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-14, 16, 20 విభాగాల క్రీడాకారులకు 400 మీటర్ల పరుగు పందెం, అండర్-18 కేటగిరీలో 100, 200, 400, 800, 1500, 3000, 5000, 10,000, 20,000 స్టిపుల్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, లాంగ్‌జంప్, హై జంప్, పోల్‌వాల్ట్ ఈవెంట్లలో ఎంపికలు ఉంటాయన్నారు. క్రీడాకారులు 19న ఉదయం 9గంటలకు జేఎన్ఎస్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 93910 29491, 93901 04499 నంబర్లలో సంప్రదించాలి.

‘లక్ష్మీపురం’ ఆదాయానికి గండి

- మార్కెట్లో అద్దె వసూళ్లపై అధికారుల నిర్లక్ష్యం
- కవర్‌షెడ్, ఓపెన్ ప్లాట్లను పట్టించుకోని అధికారులు
- అస్తవ్యస్తంగా కూరగాయల మార్కెట్
- అడ్రస్ లేని అగ్రిమెంట్ ప్రక్రియ


వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్


వాహనాల పార్కింగ్, రైతులు, వ్యాపారులు నిద్రించేందుకు ఆవాసంగా కవర్ షెడ్

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌ను ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించింది. అధికారుల ఉదాసీనత కారణంగా వ్యాపారుల నిర్లక్ష్యంతో ఈఏడాది సుమారు రూ.1.50 కోట్ల ఆదాయం మార్కెటింగ్ శాఖ కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. మోడల్ మార్కెట్‌లో 95 కమిషన్ లైసెన్స్‌దారులకు 82 మడిగెలు, చిల్లర వ్యాపారులకు కవర్ షెడ్‌లో 158 ప్లాట్లు, బహిరంగంగా మరో 230 ప్లాట్లను అధికారులు చోటామోటా వ్యాపారులకు అప్పగించారు. ఇవి కాకుండా అనధికారికంగా మరో 200 మంది వరకు మార్కెట్ లోపల, బయట వ్యాపారాలు చేస్తున్నారు. వీటికి తోడు బయట కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించి టెండర్లు నిర్వహించి 30 మంది వ్యాపారులకు అప్పగించారు.

వ్యాపారులకు అప్పగించిన అధికారులు అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేయకపోవడం, కమర్షియల్ కాంప్లెక్స్‌లో అద్దె వసూళ్లలో ప్రతిబంధకాలతో ఈఏడాది పెద్ద మొత్తంలో మార్కెట్ ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.

పూర్తికాని అగ్రిమెంట్..

కూరగాయల మార్కెట్‌లోని 95 మంది కమీషన్ వ్యాపారుల్లో 82 మందికి మడిగెలు కేటాయించారు. ఇందులో 20 మడిగెల్లోని వ్యాపారులతో నేటికీ అగ్రిమెంట్ ప్రక్రియ చేయించలేకపోయారు. కమీషన్ వ్యాపారులు తాము పొందిన మడిగెల్లో వ్యాపారం చేసుకుంటున్నా.. మార్కెట్ అధికారులు మిన్నకుండి పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అగ్రిమెంట్ లేకుండా తక్‌పట్టీలు రాయకుండా ఎలా కమీషన్ వ్యాపారులుగా చెలామణీ అవుతున్నారో మార్కెట్ అధికారులకే తెలియాలి.

కవర్‌షెడ్‌పై నిర్లక్ష్యం..

మార్కెట్‌లో ఓపెన్ ప్లాట్లు కేటాయించడంతో కొనుగోలుదారులు లోపలకు రావడం లేదని కవర్‌షెడ్‌లోని 158 మంది చిల్లర వ్యాపారులు పలుమార్లు అధికారులకు మొర పెట్టుకున్నారు. ఓపెన్ ప్లాట్లలో గిరాకీ ఉన్నందున కవర్‌షెడ్ ఖాళీగా మారడంతో పార్కింగ్‌గా మారింది. ఈప్లాట్లకు అద్దె ఎక్కువగా ఉన్నందున తగ్గించి అగ్రిమెంట్ చేయాలని వ్యాపారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయాన్ని మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏడాదిగా ఎలాంటి అద్దె వసూలు చేయని పరిస్థితులు నెలకొన్నాయి.

కమర్షియల్ లాస్..

మోడల్ మార్కెట్‌కు అనుసంధానంగా నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్ అద్దెలు వసూలు కాకపోవడంతో మార్కెట్‌కు పెద్ద మొత్తంలో నష్టం వచ్చింది. 30 షాపులకు టెండర్లు నిర్వహించి ఒక్కొక్కరి వద్ద 3 నెలల అద్దెలను అడ్వాన్సుగా తీసుకుని అప్పగించారు. ఈకాంప్లెక్స్‌లో ప్రతీ నెల రూ.6.25లక్షలు వసూలు కావాల్సి ఉంది. అద్దెలు ఎక్కువగా ఉన్నాయని అగ్రిమెంట్ చేసుకున్న వారిలో చాలా మంది వదిలేశారు. అగ్రిమెంట్‌లో ఉన్న నిబంధనలు పరిగణనలోకి తీసుకొని 2, 3 నెలలు చూసి వెంటనే ఈషటర్లకు రీ టెండర్లను నిర్వహిస్తే మార్కెట్‌కు ఆదాయం వచ్చేది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లుగా ఇప్పుడు అద్దెలు చెల్లించని, కోర్టు కేసుల్లో ఉన్న వాటిని మినహాయించుకుని మిగిలిన 18 షట్టర్లకు ఈనెల 22న టెండర్లు నిర్వహిస్తున్నట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

మార్కెట్‌కు నష్టమెంతంటే..

- కమీషన్ వ్యాపారులకు అప్పగించిన మడిగెల నుంచి ప్రతి నెలా సుమారు రూ.3 లక్షలు అద్దెల రూపంలో రావాల్సి ఉంది. ఇందులో అగ్రిమెంటు, తక్‌పట్టీలు లేక సుమారు రూ.20 లక్షల వరకు ఆదాయం మార్కెట్‌కు దక్కడంలేదు.
- ఓపెన్ ప్లాట్లు వివిధ సైజులు 230 ప్లాట్లు అధికారికంగా కేటాయించారు. ఒక్కోదానికి కనీసం రూ.800 చొప్పున అనుకున్నా.. ఏడాదికి(12)నెలలకు రూ.22,08,000లు ఆదాయం కోల్పోయినట్లు.
- కూరగాయల మార్కెట్‌లోని కవర్ షెడ్‌లో 158 మంది చిల్లర వ్యాపారులకు కేటాయించారు. నిర్ణయించిన ప్రకారం అద్దె రూ.2,300 చొప్పున 12 నెలలకు రూ.43,60,800లు ఆదాయం కోల్పోయినట్లు.
- కమర్షియల్ కాంప్లెక్స్‌లో 30 షటర్లకు నెలకు రూ.6,25,000లు వసూలు కా వాల్సి ఉంది. ఏడాదికి రూ.75 లక్షల ఆ దాయం మార్కెట్‌కు రావాల్సి ఉంది. ఎందరు కట్టారు? ఎవరు కోర్టుకు వెళ్లా రు? అద్దెలు కట్టకున్నా.. ఏడాది వరకు ఎందుకు నిరీక్షించారు? అనే విషయాలు అధికారులకే తెలియాల్సి ఉంది.

కలుషిత నీటితో విద్యార్థులకు అస్వస్థత

- సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..

మహబూబాబాద్ అర్బన్: కలుషిత నీరు తాగి సుమారు పది మంది విద్యార్థులు అస్వస్థతతకు గురైన ఘటన శుక్రవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మానుకోట జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సుమారు 720 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నాలుగు రోజుల నుంచి మానుకోటలో మరమ్మతుల కారణంగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గత మూడ్రోజుల నుంచి విద్యార్థులు బోరు నీళ్లు తాగుతున్నట్లు విద్యార్థులు తాగుతున్నారు. మరికొంత మంది విద్యార్థులు చెప్పిన వివరాల ప్రకారం.. మంచినీటిలో బ్లీచింగ్ పౌడర్ వాటర్ ట్యాంకులో ఎక్కువ వేయడం వల్ల ఆ నీటిని తాగడంతోనే రెండ్రోజుల నుంచి విద్యార్థులందరికీ మోషన్స్, వాంతులు, జ్వరం వస్తోందని తెలిపారు. గత రెండు మూడ్రోజులుగా విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా.. ఆ సమాచారాన్ని బయటకు రాకుండా పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు దాచిపెట్టేందుకు యత్నించారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ రూపాదేవిని వివరణ కోరగా.. మి షన్ భగీరథ నీళ్లలో బ్లీచింగ్ పౌడర్ ఎక్కువైంద ని, విద్యార్థులు తాగడంతో 5 నుంచి పది మంది విద్యార్థులకు మోషన్స్ అయ్యాయని తెలిపారు. వారిని వెంటనే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించినట్లు తెలిపారు.

సంస్కారం మరిచి మాట్లాడుతున్నారు

- ఉనికి కోసం రేవంత్‌రెడ్డి, షర్మిల పాదయాత్రలు
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫైర్


సింగరాజుపల్లిలో కేసీఆర్ జన్మదిన వేడుకల్లో మంత్రి ఎర్రబెల్లి, కలెక్టర్ శివలింగయ్య

జనగామ/దేవరుప్పుల: బీఆర్ఎస్‌పై, సీఎం కేసీఆర్‌పై, నాయకులపై రేవంత్‌రెడ్డి, షర్మిల కనీస సంస్కారం మరిచి పచ్చిగా మాట్లాడుతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో ఉచిత కుట్టుమిషన్ కేంద్రం వద్ద మహిళల మధ్య సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ శివలింగయ్యతో కలిసి మంత్రి కేక్ కట్ చేశారు. అనంతరం కామారెడ్డిగూడెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మొక్కలు నాటారు. దేవరుప్పుల చౌరస్తాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అధ్యక్షతన కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి ఆయా చోట్ల మాట్లాడుతూ.. ఆర్టీఏ పేరిట బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో పబ్బం గడుపుకునే రేవంత్ రెడ్డి, కబ్జాలు, గుండాగిరి తదితర కేసుల్లో పాతుకుపోయిన జంగా రాఘవరెడ్డి తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల వచ్చిన తర్వాత, పాలకుర్తిలో హాస్పిటల్ అని మొరుగుతున్నారన్నారు.

రాయపర్తి సమీపం మహబూబ్‌నగర్‌కు చెందిన ముస్లింల భూములు ఎవరి పేరిట ఉన్నాయో తెలుసుకుని మాట్లాడితే మంచిదన్నారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని షర్మిల కూడా మాట్లాడడం శోచనీయమన్నారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలనే సంకల్పంతో.. గత పాలకులు వదిలేసిన పనులను సీఎం కేసీఆర్ మొదలు పెట్టారన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ కార్యాలయ సమన్వయకర్త డాక్టర్ సుల్తాన్‌రాజా, దేవరుప్పుల మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం, పల్ల సుందర్‌రామిరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, రైతుబంధు మండల కన్వీనర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగును పరిరక్షించడం మన బాధ్యత

- ఏపీ శాసనమండలి పూర్వ సభాపతి మండలి బుద్ధ ప్రసాద్
- విశ్రాంత ఐఏఎస్ విజయభాస్కర్‌కు కవితాప్రసాద్ పురస్కారం


మాట్లాడుతున్న ఏపీ పూర్వ శాసనసభాపతి మండలి బుద్ధప్రసాద్

విద్యారణ్యపురి: తెలుగును పరిరక్షించడం మన అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ పూర్వ సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ రజతోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమకొండలోని సామ జగన్మోహన్‌రెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కవితా ప్రసాద్ సేవలను కొనియాడారు. కవితాప్రసాద్ కవిత్వ తత్వాన్ని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య విశ్లేషించారు. తుమ్మూరి లక్ష్మణరావు కవితా ప్రసాద్ కావ్యాల్లోని పద్యాలు వినిపించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి దీర్ఘాషి విజయభాస్కర్‌కు కవితాప్రసాద్ పురస్కారాన్ని అందించి సత్కరించారు. రామశాస్త్రి, వెంకటయ్య, జనార్దన్‌ను సత్కరించారు. ఆ సంస్థ బాధ్యులు గిరిజామనోహర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సంస్థ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎన్‌వీఎన్‌చారి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, బీఎంరెడ్డి, భాస్కర్, పొట్లపల్లి, విద్యార్థి, మురళీధర్ సాహితీవేత్తలు, ఆసంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయదారుడిపై పీడీ యాక్ట్


ఖానాపురం: బాలును చర్లపల్లి జైలుకు తరలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గీసుకొండ: మండలంలోని నందనాయక్‌తండాకు చెందిన భూక్య భిక్షపతి గుడుంబా తయారు చేస్తూ విక్రయిస్తుండగా అతడిపై 8 కేసులు నమోదయ్యాయి. అతడిలో మార్పు రాకపోగా.. మళ్లీ విక్రయాలు చేస్తుండడంతో పీడీ చట్టం ప్రయోగించి అరెస్టు చేసి హైదరాబాద్‌లోని చర్లపెల్లి జైలుకు తరలించినట్లు శుక్రవారం పరకాల స్టేషన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కె.జగన్నాథరావు తెలిపారు. భిక్షపతిని గతంలో గుడుంబా విక్రయిస్తున్నాడని గీసుకొండ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని, పరకాలలో రిమాండ్ చేసినప్పటికీ బెయిల్‌పై వచ్చి మళ్లీ అమ్మకాలు చేస్తున్నాడని, బ్రీచ్ కేసు నమోదు చేసి అతడి నుంచి రూ.1.50 లక్షల రుసుము వసూలు చేసినట్లు తెలిపారు. అయినా అతడు తన తీరు మార్చుకోకపోవడంతో.. తమ శాఖ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు ఆదేశాలు, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పీడీ చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

బెల్లం రవాణా చేస్తున్న వ్యక్తిపై..

ఖానాపురం: మండలంలోని నాజీతండాకు చెందిన బెల్లం వ్యాపారిపై పీడీ యాక్టు కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ రాజసమ్మయ్య తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. నాజీతండాకు చెందిన అజ్మీర బాలు బెల్లం, పటిక, నాటుసారా రవాణా చేస్తూ పలుమార్లు ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ అమలు చేసి బాలును గురువారం రాత్రి చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గుడుంబా తయారు చేసినా, బెల్లం రవాణాకు పాల్పడినా పీడీ యాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నర్సంపేట రూరల్: చికిత్స పొందుతూ నర్సంపేట పట్టణంలోని స్నేహనగర్‌కు చెందిన మద్దెబోయిన రాజశేఖర్ (34) మృతి చెందాడు. రాజశేఖర్ మేస్త్రీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. కడుపు నొప్పి తీవ్రంగా రావడంతో భరించలేక ఈనెల 15న పురుగుల మందు తాగాడు. స్థానికులు నర్సంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. ప్రాథమిక చికిత్స నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు రెఫర్ చేశారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ.. శుక్రవారం రాత్రి రాజశేఖర్ మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగ

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి ఎక్సైజ్ కాలనీలోని భరోసా కేంద్రానికి విధులకు వస్తున్న హెల్త్ వర్కర్ పోలేపాక పవిత్ర మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయినట్లు సబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు. శుక్రవారం హసన్‌పర్తి మండలం, పెగడపల్లికి చెందిన పవిత్ర విధులకు వస్తుండగా.. స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని దొంగ గొలుసును మెడలో నుంచి లాక్కెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. బంగారు గొలుసు విలువ రూ. 20 వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బిడ్డపై అఘాయిత్యం చేసిన తండ్రి అరెస్ట్

ఖిలా వరంగల్: కూతురును బెదిరించి అత్యాచారం చేసిన కన్నతండ్రిని పోక్సో కేసులో శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. వరంగల్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌తో కలిసి ఏసీపీ కేసు వివరాలు వెల్లడించారు. ఉర్సు కరీమాబాద్‌కు చెందిన ఓ తండ్రి బీరువాల దుకాణంలో పని చేస్తుండగా, అతడి భార్య బట్టల షాపులో పని చేస్తోంది. వీరి కుమార్తె నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. గతేడాది ఆగస్టులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఉన్న తండ్రి. తన 16 ఏళ్ల కుమార్తెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈవిషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అనంతరం బాలిక ఒంటరిగా ఉన్న పలు సమయాల్లో లైంగికంగా లోబర్చుకున్నాడు. బాలిక గత నెల అనారోగ్యానికి గురైంది. ఆబాలికను తల్లి సీకేఎం ఆస్పత్రిలో వైద్యులకు చూపించగా 17 వారాల గర్భవతి అని వైద్యులు చెప్పారు. వైద్యుల సూచనల మేరకు లాయర్ ఆఫిడవిట్ తీసుకెళ్లగా.. ఈనెల 9న అబార్షన్ చేశారు. ఆతర్వాత ఆబాలికను నేరుగా మేనమామ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ జరిగిన విషయాన్ని బాలిక మేనమామకు వివరించింది. గుట్టుగా ఉన్న విషయాన్ని ఈనెల 14న బాలిక తల్లి, మేనమామ ఇద్దరి సహకారంతో బాధిత బాలిక తన తండ్రిపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కామాంధుడైన ఆబాలిక తండ్రిని శుక్రవారం ఉదయం కరీమాబాద్‌లో అరెస్ట్ చేశారు. అనంతరం నిందితున్ని కోర్టులో హాజరు పర్చగా జడ్జి ఆదేశాల మేరకు ఖమ్మం జైలుకు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

దళిత మహిళపై లైంగిక దాడికి యత్నం

నెక్కొండ: మండలంలోని గుండ్రపెల్లి గ్రామానికి చెందిన ఓ దళిత మహిళపై లైంగికదాడికి యత్నించిన అదే గ్రామానికి చెందిన తక్కెళ్లపెల్లి జితేందర్‌రావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. నెక్కొండ సీఐ హత్తీరాంనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 13న గ్రామ చివరన ఉన్న తమ ఇంట్లో ఉంచిన యూరియా బస్తాల కోసం మహిళ వచ్చింది. ఆమెను గమనించిన జితేందర్‌రావు ఒంటరిగా ఉన్న ఆమెపై అవమానంగా వ్యవహరించడంతోపాటు అత్యాచారానికి యత్నించాడు. అవమానానికి గురైన ఆమె హైదరాబాద్‌లో ఉన్న భర్త దగ్గరికి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో సదరు దంపతులు ఈవిషయమై గ్రామ పెద్దలను ఆశ్రయించారు. పెద్దల సమక్షంలో జరిగిన పంచాయితీకి జితేందర్‌రావు రాలేదు. దీంతో ఆమె ఈనెల 16న రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దళిత మహిళను అవమానపర్చడం, అత్యాచారానికి యత్నించడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు శుక్రవారం సాయంత్రం విచారణ జరిపారు.

పుట్టిన రోజు వేడుకలకు వెళ్లొస్తూ..

- లారీ ఢీకొని ఇద్దరు యువకుల మృతి
- ఎంజీఎంలో మరో యువకుడికి చికిత్స



మృతులు భరద్వాజ్, లోకేశ్

కాజీపేట: స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లొస్తూ ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. కాజీపేట-ప్రగతినగర్ కాలనీ ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన తుసం భరద్వాజ్(20), లోకేశ్(21) మృతి చెందారు. అజయ్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్న భరద్వాజ్, లోకేశ్, అజయ్ గురువారం అర్ధరాత్రి నగరంలోని తమ స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యారు. తిరిగి ఒకే బైక్‌పై కాజీపేట వైపు వస్తుండగా.. నిట్ సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భరద్వాజ్ అక్కడికక్కడే మృతి చెందగా.. లోకేశ్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. తీవ్ర గాయాలతో అజయ్ చికిత్స పొందుతున్నాడు. మృతుడు భరద్వాజ్ తండ్రి శైలేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. కాగా.. ఎంజీఎం పోస్టుమార్టమ్ కేంద్రానికి దక్షిణ మండలం డీసీపీ ఎంఏ బారి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. బంధు, మిత్రులతో ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వరకు పిల్లలు బయట తిరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కన్నవాళ్లపైనే ఉందన్నారు.

స్నేహితులను కలిసేందుకు వచ్చి..


సాయికుమార్(ఫైల్)

నడికూడ: మండలంలోని కౌకొండ గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హుజూరాబాద్ మండలం ఇప్పల్ నర్సింగాపురం గ్రామానికి చెందిన గాజ సాయికుమార్(22) మృతి చెందాడు. సాయి వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం స్నేహితులు భారత్‌రెడ్డి, శివతో కలిసి భారత్‌రెడ్డి బైక్‌పై మండలంలోని కౌకొండ గ్రామంలో ఉన్న స్నేహితులను కలిసేందుకు వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో గ్రామ కమాన్ మూలమలపు వద్ద బైక్ అదుపు తప్పి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స కోసం పరకాలలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయి మృతి చెందాడు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దామెర ఎస్సై అనిల్ తెలిపారు.

నిట్‌లో ‘క్యూరా-23’


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిట్ డైరెక్టర్, ఐఐఎం డైరెక్టర్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ‘క్యూరా-23’ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు, బెంగళూరు ఐఐఎం డైరెక్టర్ రిషికేశ్ కృష్ణన్‌లు రామన్ సెమినార్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి సారించాలని రమణారావు కోరారు. బెంగళూరు ఐఐఎం డైరెక్టర్ రిషికేష్ కృష్ణన్ మాట్లాడుతూ.. మెషిన్ లెర్నింగ్, ఐఓటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లలో ఇంజనీరింగ్ విద్యతో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెడ్ రమాదేవి, ఫ్యాకల్టీ అడ్వయిజర్ గోపాల్, స్టూడెంట్ కోఆర్డినేటర్ తేజస్విని, తదితరులు పాల్గొన్నారు. క్యూరా-23లో భాగంగా విద్యార్థులకు హౌస్ ఆఫ్ రీసోర్స్, మైండ్‌ఫెస్ట్, పిచ్ పర్ఫెక్ట్ పోటీలు నిర్వహించారు. వేడుకలు రెండు రోజులపాటు జరగనున్నాయి.